క్లుప్తంగా

నేటి నుంచి పింఛన్లు పంపిణీ

నాదెండ్ల: పెంచిన పెన్షన్లు నేటి నుంచి పంపిణీ చేయనున్నట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీ మేరకు వితంతువులు, వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెరిగిన పింఛన్లను ఏప్రియల్, మే, జూన్ మాసాలకు సంబంధించి అందించనున్నట్లు తెలిపారు. మండలంలో అప్పాపురం గ్రామంలో 9.30 గంటలకు, నాదెండ్లలో 10.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కూటమి నాయకులైన బీజేపీ, జనసేన నాయకులు హాజరు కావాలని కోరారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



నరసరావుపేట ఈస్ట్: ప్రతిభగల నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థులకు లయన్ పెనుగొండ వెంకటేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందచేయనున్నట్టు ట్రస్ట్ అధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు ఆదివారం ట్రస్ట్ కార్యాలయంలో స్కాలర్‌షిప్ దరఖాస్తులను విడుదల చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్, ఫార్మసీ, సీఏ చదవుతున్న పేద ఆర్యవైశ్య విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వెంకటేశ్వరరావు తెలిపారు. అర్హులైన వారికి ఒక్కొక్కరికీ రూ.3 వేలు చొప్పున 51 మంది విద్యార్థులకు అందచేస్తామన్నారు. దరఖాస్తులకు 9440220453, 9440261054, 9246453348 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, పెనుగొండ ప్రభాకర్, మండవ పూర్ణచంద్రరావు, వెల్లంపల్లి కేశవరావు పాల్గొన్నారు.

డీటీ అబ్బూరి సేవలు ఎనలేనివి



వినుకొండ(నూజెండ్ల): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్బూరి వెంకటేశ్వర్లు పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించి గత ఏడు సంవత్సరాలుగా వినుకొండ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంతో అంకితభావంతో అబ్బూరి ఎనలేని సేవలు చేశారన్నారు. అనంతరం అబ్బూరి దంపతులను దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ దానియేలు, న్యాయవాదులు రామకోటేశ్వరరావు, సైదారావు, అక్కయ్య, సూర్యపేట సీఐ పి.రాఘవులు, అబ్బూరి వీరయ్య, అనుమల వెంకయ్య, వెంకట్రావు, ఆర్ఐ శ్రీహరి, వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో లాభాపేక్షకు చోటివ్వద్దు




కార్యక్రమంలో డాక్టర్ మల్రిపెద్దయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ రవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, డాక్టర్లు

- సీఎంఇ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- డాక్టర్ల దినోత్సవం సందర్భంగా పలువురు డాక్టర్లకు సన్మానం

నరసరావుపేట: డాక్టర్లు లాభాపేక్ష లేకుండా పేద, బడుగు వర్గాలకు ఆధునిక వైద్యం అందజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సూచించారు. కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఇ)లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాసు సొసైటీ జిల్లా అధ్యక్షులు, డాక్టర్ కొండవీడు ఇఎన్‌టీ హాస్పిటల్ డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పెద్దచెరువు బైపాస్‌రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానికంగా లాభాపేక్ష లేకుండా సేవచేసిన డాక్టర్స్ చాలామంది ఉన్నారని, వారిలో మొదటిగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైద్య వృత్తిలో సేవలు అందించిన వారికి ప్రజా సేవచేసే అవకాశం ప్రజలు కల్పించారని, వారిలో డాక్టర్ కోడెల ఐదుసార్లు, డాక్టర్ గోపిరెడ్డికి రెండుసార్లు, అదేవిధంగా తనను ప్రజలు అసెంబ్లీకి పంపించారని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని తాను బాధ్యతతో నిర్వహిస్తానని తెలియజేశారు. డాక్టర్లు పుస్తకాలు చదవటంతోపాటు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నూతన విషయాలను తెలుసుకోవచ్చన్నారు. మాలాగే మీరు కూడా లాభాపేక్ష లేకుండా వైద్య సేవలు అందించాలని కోరారు. మారుమూల ప్రాంతాలలో కూడా ఎంతోమంది వైద్యులు వైద్య సహాయం అందిస్తున్నారని, డాక్టర్లు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. అర్ధరాత్రి అయినా ప్రజలకు అందుబాటులో ఉంటామని, అలాంటి వాళ్లలోనే డాక్టర్ మన్యం రవీంద్ర, జాన్సన్, బెంజిమెన్ ఉన్నారని తెలియజేశారు. అదేవిధంగా సీఎంఇ కార్యక్రమాలను ప్రతినెలా జరిగేలా చూడాలని సూచించారు. పల్నాడు జిల్లా ఐఎంఏను అభివృద్ధి చేయడంలో తనవంతు సహాయ సహకారాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి మాట్లాడుతూ సీఎంఇ ప్రోగ్రాం నిర్వహించడం వలన డాక్టర్స్ వారి వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవచ్చని ఇటువంటి కార్యక్రమాలు తరుచూ జరుగుతూ ఉండాలని ఆకాంక్షించారు. ఐఎంఏకు కావల్సిన సహాయ సహకారాలను డీఎంహెచ్‌వో తరఫున తప్పనిసరిగా ఉంటాయని హామీ ఇచ్చారు. సోమవారం నిర్వహించే డాక్టర్స్ డే సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ మల్రి పెద్దయ్య, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ రవిలను సత్కరించారు. డాక్టర్ సూర్యనారాయణ పర్యవేక్షణ చేయగా డాక్టర్లు గజ్జల బ్రహ్మారెడ్డి, సి.గౌతమి, కామిరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ప్రముఖ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్నంలోగా 95 శాతం పెన్షన్ పంపిణీ జరగాలి

ఎంపీడీవో వై.శ్రీనివాసరావు

యడ్లపాడు: మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీకి కార్యక్రమానికి రంగం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో వై.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటలకు అన్ని గ్రామాల్లోనూ పెన్షన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈసారి సచివాలయ ఉద్యోగులు ఈ పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలోని 273 క్లస్టర్లలో ఉన్నాయని, ఒక్కొక్కరికీ 3,4 క్లస్టర్లను అనుసంధానం చేసి కనీసం 50–60 మందికి పంపిణీ చేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 8073 మంది పెన్షన్ దారులు ఉన్నారని, ఒక్కొక్కరికీ రూ.7 వేల చొప్పున అందించేందుకు రూ.5,43,12,500 నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే బ్యాంకుల నుంచి పెన్షన్ పంపిణీకి సంబంధించిన నగదు డ్రా చేసి కార్యదర్శులకు అప్పగించినట్లు తెలిపారు. మధ్యాహ్న సమయానికే పెన్షన్ పంపిణీ 95 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. లబ్ధిదారులు ఎవరైనా అందుబాటులో లేకుంటే వారికి మరుసటి రోజైన మంగళవారం ఇచ్చేలా మార్గ నిర్దేశకాలు చేశామని తెలిపారు.

నేటి నుంచి స్టాప్ డయేరియా కార్యక్రమం

దాచేపల్లి: ప్రభుత్వం ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఇమ్మడిశెట్టి అమూల్య ఆదివారం తెలిపారు. జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రల వల్ల డయేరియా బారి నుంచి బయటపడవచ్చునని చెప్పారు. వాంతులు, విరేచనాలతో బాధపడే వారు తక్షణమే వైద్యసేవలు పొందాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

మిద్దె తోటల పెంపకం అందరికీ ఆరోగ్యం

డీపీఎం అమల కుమారి



మహిళలకు మొక్కలు అందజేస్తున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట: మిద్దె తోటలు వేసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన ఆహారం ప్రతి ఒక్కరికీ అందుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి అన్నారు. ఆదివారం వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించిన మిద్దె తోటల గ్రూప్ సభ్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పుడు మార్కెట్లో దొరికే కూరగాయల్లో రసాయనాలు ఎక్కువగా వాడినవి మాత్రమే దొరుకుతున్నాయని చెప్పారు. అవి తినడం వల్ల మనకు అనేక రకాలైన రోగాలు వస్తున్నాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు కూడా మిద్దె తోటలలో కూరగాయలు వేసుకొని ఆరోగ్యకరమైన ఆహారం తినాలని కోరారు. మిద్దె తోటలలో వేసుకోవడానికి 15 రకాల చామంతి, కూరగాయ మొక్కలు సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, మహిళలు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు కాజేసి..

యడ్లపాడు: ఏటీఎంకు వచ్చిన వ్యక్తి కళ్లుగప్పి కార్డు కాజేయడంతో పాటు అతని ఖాతాలోని రూ.40 వేల నగదును మాయం చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు కథనం ప్రకారం.. యడ్లపాడు ఎస్టీ కాలనీకు చెందిన కారుచోల సత్యనారాయణ ఈనెల 27న స్థానిక యూనియన్ బ్యాంక్ ఆవరణలో ఉన్న ఏటీఎం సెంటర్‌కు వెళ్లాడు. నగదు డ్రా చేసేందుకు సాయం చేస్తున్నట్లు నటిస్తూ మిషన్‌లోని ఏటీఎం కార్డును కాజేసి, అటువంటిదే మరోకార్డును సత్యనారాయణ చేతిలో పెట్టాడు. ఇది జరిగిన అరగంటకే అదే ఏటీఎం ద్వారా సత్యనారాయణ ఖాతా నుంచి రూ.15 వేలు డ్రా చేశాడు. మరుసటి రోజు చిలకలూరిపేట మండలం పసుమర్రులోని ఏటీఎం ద్వారా మరో రూ.25 వేలు డ్రా చేశాడు. ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లతో తను మోసపోయానని గ్రహించిన సత్యనారాయణ బ్యాంకులో తన ఖాతాను బ్లాక్ చేయించి, యడ్లపాడు పోలీసులకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేశాడు.

హామీలు అమలు చేయండి



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: అంగన్వాడీల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు, జీవోలు ఇవ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. అంగన్వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద వర్కరుకు రూ.1.20 లక్షలు, హెల్పరుకు రూ.60 వేలు ఇస్తూ జీవో నంబరు 47లో మార్పులు చేయాలని కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా, సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన ఖర్చుల కింద రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ప్రధానమంత్రి జీవిత బీమా అమలు చేయాలని జీవో జారీ చేయాలన్నారు. అర్హత కలిగిన అంగన్వాడీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. నాయకులు డి.శివకుమారి, బేబీరాణి, సుబ్బరావమ్మ పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

యడ్లపాడు: మండలంలోని మూడు గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం సందర్శించనున్నట్లు ఎంపీడీవో వై శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో ఉదయం 5 గంటలకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ అధికారులు ప్రారంభించాలని ఆదేశించారు. 9 గంటలకు లింగారావుపాలెం, మైదవోలు, యడ్లపాడు గ్రామాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించి, ఆయా గ్రామాల్లోని గ్రామపెద్దలతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు.

నేడు చౌడేశ్వరీ ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో వేంచేసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం 16వ వార్షికోత్సవాలు సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు దేవస్థానం కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ నేతృత్వంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు, ఉదయం 7 గంటలకు పంచామృతాభిషేకం, 9కి హోమం, 10 గంటలకు బోనాల సమర్పణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు మహాన్నదానం చేస్తారని తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మెగా వైద్యశిబిరంలో రోగులకు వైద్యసేవలు అందజేస్తున్న వైద్యసిబ్బంది

బొల్లాపల్లి: వినుకొండ పట్టణానికి చెందిన శ్రీదత్త సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ పలు రకాల వ్యాధులకు సుమారు 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు హాస్పటల్ ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ జి.కృష్ణకాంత్ తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనారోగ్య లక్షణాలను కనిపించినట్లయితే తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో జనరల్ ఫిజిషియన్ చల్లా వెంకటేశ్వరరావు, ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ శామ్యూల్, డాక్టర్ భవాని, హాస్పటల్ జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్‌కుమార్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వస్థలానికి సాయిరామ్ మృతదేహం

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



సాయిరాం మృతదేహం వద్ద తల్లి అన్నపూర్ణమ్మ

అచ్చంపేట: మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన గుంటుపల్లి సాయిరామ్ (25) ఉన్నత చదువుల నిమిత్తం మూడు సంవత్సరాల క్రితం లండన్ వెళ్లారు. ఈ నెల 2వ తేదీన అక్కడ బీచ్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని స్వగ్రామమైన కోనూరుకు స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ నాయకులు కంచేటి సాయిబాబు సహకారం, స్నేహహస్తాలు ఫౌండేషన్ కృషితో ప్రత్యేక విమానంలో శనివారం తీసుకొచ్చారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రత్యేక విమానంలో మృతదేహం తరలించారు. అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వ అంబులెన్స్‌లో శనివారం రాత్రి స్వగ్రామమైన అచ్చంపేటకు తీసుకొచ్చారు. ఉన్నత చదువులు చదువుకుంటూ ఉద్యోగం చేసేందుకు లండన్ వెళ్లిన కుమారుడు విగతజీవిగా రావడంతో తల్లి అన్నపూర్ణమ్మ, కుటుంబసభ్యులు, బంధువులు తల్లడిల్లిపోయారు. కన్నీరుమున్నీరుగా ఆదివారం ఉదయం సాయిరాం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు కూడా సాయిరామ్‌కు నివాళులర్పించారు.